క్లుప్తంగా

ప్రాణం తీసిన కుటుంబ కలహాలు

● ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య



ఎల్కతుర్తి : కుటుంబ కలహాలు ఒకరి ప్రాణాలు తీశాయి. భర్త, అత్త పోరు తాళలేక ఆ గృహిణి ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవర్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన శ్రీరామోజు హిమబిందు (36) భర్త శ్రీరామోజు రమేశ్, అత్త శ్రీరామోజు లక్ష్మి నడుమ సోమవారం గొడవ జరిగింది. దీంతో హిమబిందును భర్త, అత్త కలిసి శారీరకంగా, మానసికంగా వేధించడంతో మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దాడికేసులో నిందితుడి రిమాండ్

దామెర : దాడి చేసిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన దామెర పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 1న ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన దయ్యాల మనీష్‌పై మండలంలోని ఊరుగొండ ఈద్గా వద్ద ఊరుగొండ గ్రామానికి చెందిన పొలెపాక ప్రభుకిరణ్‌తో పాటు మరో ఇద్దరు దాడిచేసి అతడి వద్ద నుంచి ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్లు, మూడు తులాల వెండి చైన్‌తో పాటు రూ.700 నగదు అపహరించినట్లు తెలిపారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు.. నిందితుడైన పొలెపాక ప్రభుకిరణ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. కాగా నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

యువతి అదృశ్యం

యువతి అదృశ్యమైన ఘటన దామెర మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. పరకాలకు చెందిన 22 సంవత్సరాల యువతి దామెరలోని తన చిన్నమ్మ ఇంట్లో రెండురోజులుగా ఉంటుంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం దుకాణానికి వెళుతున్నానని చెప్పి తిరిగిరాలేదు. చుట్టుపక్కల ఇళ్లలో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రులకు అప్పగింత



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన కోగిల సదానందం కూతురు కోగిల సంధ్య మంగళవారం ఉదయం తప్పిపోయింది. దీంతో సదానందం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై జక్కుల పరమేశ్ సిబ్బందితో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. దీంతో ఆమె ఆరెపల్లి శివారులో కనిపించగా పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. ఎస్సై పరమేశ్‌ను, సిబ్బందిని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచ్ కమిటీ ఎన్నిక

కాజీపేట రూరల్ : స్థానిక రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ లోకోరన్నింగ్ బ్రాంచ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ బ్రాంచ్ నూతన కమిటీ సభ్యులు మంగళవారం విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల సంఘ్ రన్నింగ్ బ్రాంచి సెక్రటరీ, డిప్యూటీ డివిజనల్ సెక్రటరీగా పని చేసిన చింత మురళి పదవీ విరమణ పొందడంతో డాక్టర్ మర్రి రాఘవయ్య ఆ స్థానాన్ని భర్తీ చేస్తూ రైల్వే అధికారులకు కో ఆప్షన్ లెటర్ పంపడంతో అధికారులు నూతన కమిటీ ఎన్నిక పత్రాన్ని విడుదల చేశారని తెలిపారు. రెల్వే ఎంప్లాయీస్ సంఘ్ లోకోరన్నింగ్ బ్రాంచ్ సెక్రటరీగా కె.రవి, చైర్మన్‌గా పాక రాజ్‌కుమార్, వర్కింగ్ చైర్మన్‌గా సుధాకర్, ట్రెజరర్‌గా జి.లక్ష్మీనారాయణను నియమించారు.

ఎట్టకేలకు బోరువెల్ ఏర్పాటు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ కామన్ మెస్‌వద్ద విద్యార్థులు చాల రోజుల నుంచి నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ బోర్‌వెల్ కూడా లేదు. ఫార్మసీ కాలేజీ నుంచి నీటిని వినియోగించుకుంటున్నారు. నీటి సమస్య వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో మంగళవారం కామన్ మెస్ వద్ద బోర్‌వెల్‌ను వేయించారు. దీంతో విద్యార్థులకు నీటి ఇబ్బందులు తీరుతాయని రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, అభివృద్ధి అధికారి వాసుదేవరెడ్డి, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పి రాజ్‌కుమార్ తెలిపారు.

'స్వయంకృషి'లో అన్నదానం

హన్మకొండ చౌరస్తా : సినీనటుడు అల్లు అర్జున్ జన్మదినం సందర్భంగా మంగళవారం పెద్దమ్మగడ్డలోని స్వయంకృషి వృద్ధాశ్రమంలో అతని అభిమానులు అన్నదానం చేశారు.

అస్తవ్యస్తంగా నిర్మాణ పనులు



సీసీరోడ్డు నిర్మించే ముందు తొలగించని విద్యుత్ స్తంభం



సైడ్ డ్రైయినేజీ లేకపోవడంతో రోడ్డు పక్కన నిలిచిన మురుగునీరు

● అధికారుల నిర్లక్ష్యమంటూ స్థానికుల ఆగ్రహం
● పూర్తికాని డివైడర్ నిర్మాణ పనులు
● డ్రెయినేజీ లేక రోడ్డుకిరువైపులా నిలుస్తున్న మురుగునీరు

ఆత్మకూరు : మండలంలోని కామారం గ్రామంలో ఏడాదిన్నర క్రితం సీసీ రోడ్డు నిర్మించారు. అయితే రోడ్డు వేసే ముందు, పూర్తైన తరువాత చేయాల్సిన పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీసీ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు అలాగే వదిలేయడంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు భయాందోళన చెందుతున్నారు. అలాగే రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్లు గడుస్తున్నా డివైడర్ నిర్మాణ పనులు మొదలుపెట్టలేదని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. అలాగే రోడ్డుపై ఓ చేతిపంపును అలాగే వదిలేయడంతో అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే విధంగా రోడ్డు పక్కన సైడ్‌డ్రైనేజీ నిర్మించకపోవడంతో మురుగు నీరు రోడ్డుకిరువైపులా నిలుస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు దృష్టిసారించి సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరుతున్నారు.



రోడ్డుపై వదిలేసిన చేతిపంపు

సంక్షిప్తంగా

మండల కమిటీ ఎన్నిక



శాయంపేట : మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో అఖిల భారత పద్మశాలి సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వంగర సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా సామల ధనుంజయ్ (విజయ్), జిల్లా ప్రచార కార్యదర్శిగా బాసని బాలకృష్ణ, మండల యూత్ అధ్యక్షుడిగా బాసని సాయితేజ, గ్రామ యూత్ అధ్యక్షుడిగా సుమన్, మండల మహిళా అధ్యక్షురాలిగా బాసాని శాంత, గ్రామ అధ్యక్షురాలిగా దాసరి కల్పన, ప్రధాన కార్యదర్శిగా బాసని రాణిను ఎన్నుకుని రాష్ట్ర, జిల్లా నాయకుల ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా బైకు ర్యాలీ నిర్వహించి బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకొన్నారు. అఖిల భారత పద్మశాలి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, రాష్ట్ర కార్యదర్శి రాజగోపాల్, జిల్లా యూత్ అధ్యక్షులు పోరండ్ల కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, జిల్లా మీడియా కో ఆర్డినేటర్ రాజేందర్, ఉపాధ్యక్షులు వేణుగోపాల్, పద్మశాలీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఎల్కతుర్తి : మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన కంది రవీందర్‌రెడ్డి (ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం డైరెక్టర్) తల్లి కంది మల్లమ్మ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, ముల్కనూరు సహకార సంఘం అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంతకుముందు మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని వేడుకున్నారు.

జోగిరెడ్డి, కాసం రమేశ్, సహకార సంఘం డైరెక్టర్లు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన బండారి మణికంఠ బాసర వేద పాఠశాలలో ఇటీవల విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు అఖిల భారత పద్మశాలి సంఘం నాయకులు మణికంఠ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. అందజేసిన వారిలో అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దిడ్డి రమేశ్, మండల అధ్యక్షుడు వంగరి సాంబయ్య, ప్రధాన కార్యదర్శి ధనుంజయ, గ్రామ అధ్యక్షుడు బాసని ప్రకాశ్, ఉపాధ్యక్షుడు తుమ్మ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బాసని నవీన్, మండల యూత్ అధ్యక్షుడు బాసాని సాయితేజ, గ్రామ యూత్ అధ్యక్షుడు సుమన్, నాయకులు దేవరాజ్, రవి, మార్కండేయ, వెంకటరమణ, కదారి చంద్రమౌళి ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన ఎడ్డే సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన కొంతమంది ఆయన స్నేహితులు తలోకొంత జమచేసి బాధిత కుటుంబానికి రూ.24,500ల ఆర్థికసాయం అందించారు. శంకర్‌రావు, రాజేందర్, బాబురావు, లక్ష్మణ్, మోహన్‌రావు ఉన్నారు.

వ్యక్తికి 14రోజుల రిమాండ్

శాయంపేట : భార్యతో గొడువ పడిన కేసులో ఓ వ్యక్తి కోర్టుకు సరిగా హాజరు కాకపోవడంతో మంగళవారం పరకాల జ్యూడిషల్ మెజిస్ట్రేట్ శాలిని లింగం సదరు వ్యక్తికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వడ్డెపల్లి మహేందర్ 2022వ సంవత్సరంలో భార్యతో గొడువపడిన కేసులో నాన్‌బేలబుల్ వారేంట్ కాగా అతడు కోర్టుకు సరిగా హాజరు కాలేదని తెలిపారు. దీంతో మంగళవారం పరకాల కోర్టులో ప్రవేశపెట్టగా జ్యూడిషల్ మెజిస్ట్రేట్ శాలిని లింగం అతడికి 14 రోజుల రిమాండ్ విధించి పరకాల సబ్ జైలుకు పంపించినట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 9న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. టీచర్స్ కాలనీ, బ్యాంక్ కాలనీ, చైతన్యపురి కాలనీ, ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, ప్రకాష్‌రెడ్డిపేట, పోస్టల్ కాలనీ, పోలీసు కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, విద్యుత్ నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గోకుల్‌నగర్, అంబేడ్కర్ భవన్, అశోక కాలనీ, వికాస్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, గోపాల్‌పూర్ కల్లు మండువ కూడలి, ఎఫ్‌సీఐ కాలనీ, శివసాయి కాలనీ, విద్యాధరి స్కూల్, వెంకటేశ్వర కాలనీ, అరుణోదయ కాలనీ, బృందావన్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

ఉద్యోగులకు ప్రైవేట్‌గా ఐటీఐ చేసే అవకాశం

కాజీపేట : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న కార్మికుల కోసం ప్రైవేట్‌గా ఐటీఐ చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పరిధిలోని పరిశ్రమల్లో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసిన అభ్యర్థులు వృత్తి నైపుణ్యతను పెంపొందించుకోవడం కోసం తగిన శిక్షణ ఇప్పించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వరంగల్ ఆర్‌డీడీ కార్యాలయంలో ఈ నెల 12 లోపు తగిన ఆధారాలతో డ్రాయింగ్ అధికారితో సర్టిఫైడ్ చేయించి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో ఉద్యోగ ఐడీ, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని, రైల్వేతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్లలో పనిచేసే వారికి ఈ శిక్షణ ప్రమోషన్లు పొందేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

పాఠశాలలో స్పోర్ట్స్ డే



మడికొండ : మడికొండలోని మండల ప్రాథమిక పాఠశాలలో స్పోర్ట్స్ అండ్ కల్చరల్ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం బీరం సంధ్యారాణి, ముఖ్య అతిథిగా ఎంఈఓ బండారు మనోజ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవకు తోడుగా తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. పాఠశాల నుంచే తల్లిదండ్రులు ఇంటి వద్ద విద్యార్థులను చదివిస్తూ ఉంటే మండల స్థాయిలో మంచి ప్రతిభను కనబరిచి ఎన్నో బహుమతులు గెలుచుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోమల్‌రెడ్డి, రమేష్‌బాబు, వేణుగోపాల్, శ్రీలత, రాజేశ్వరీ, అరుణ, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

గోశాల నిర్మాణ పనులను అడ్డుకున్న అధికారులు



మున్సిపల్ అధికారులతో గోశాల నిర్వాహకుల వాగ్వాదం

కాజీపేట: గ్రేటర్‌లోని 63వ డివిజన్ బాపూజీనగర్ వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ ఆవరణలో గోశాల నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులు మంగళవారం అడ్డుకోవడంతో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోవడంతో పాటు కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల మార్కెట్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గోశాల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా గోశాలను నిర్మించడం సరికాదంటూ స్థానిక కార్పొరేటర్ల ఫిర్యాదు మేరకు ఏసీపీ రజిత, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణలు తమ సిబ్బందితో ఆకస్మికంగా మార్కెట్‌లోకి వచ్చి పనులు వెంటనే నిలిపివేయాలని హెచ్చరించారు. పనులు ఆపని పక్షంలో నిర్మాణాలను కూల్చివేస్తామంటూ సిబ్బంది ముందుకు రావడం, నిర్వాహకులు అడ్డుకోవడం చర్చనీయంశంగా మారింది. మార్కెట్ స్థలంలో గోశాల నిర్మించడం తగదని అధికారులు.. ఎట్టి పరిస్థితుల్లో పనులు ఆపేది లేదని మార్కెట్ కమిటీ సభ్యుల మధ్య మాటల యుద్ధం నెలకొంది. కమిటీ సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో అధికారులు చేసేదేమిలేక వెనుదిరిగారు. బీజేపీ నాయకుడు రామలింగం, భిక్షపతి, ఏసు, కొమరమ్మ, కళమ్మ పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్, బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలి

హన్మకొండ అర్బన్/వరంగల్ : బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో ఏకశిల పార్క్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్వోకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బొట్ల రాకేష్, నర్సింహారావు, అడ్డూరి రాజు, లింగన్న, కొంరయ్య సదానందం, సతీష్,అంకూస్, బుచ్చన్న, జవహర్‌లాల్, మల్లేశ్, కట్టయ తదితరులు ఉన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి



విద్యారణ్యపురి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు మార్కెటింగ్ నైపుణ్యాలను పెంచుకోవాలని, అప్పుడే ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని అన్నారు. మంగళవారం కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఆన్ ద జాబ్ ట్రెనింగ్ కార్యకమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. కమ్యూనికేషన్ స్కిల్స్‌ను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కామర్స్ విభాగం అధిపతి డాక్టర్ సారంగపాణి, రిలయన్స్ తెలంగాణ హెచ్ఆర్ మేనేజర్ చల్లారావు, బాధ్యులు వడ్డె సురేందర్, ప్రశాంత్, నిరాజ్ అ హ్మద్, కళాశాల బీబీఏ కోఆర్డినేటర్ సుమలత, డాక్టర్ రాజు, సమత, సురేష్, హేమలత, అకాడమిక్ కో ఆర్డినేటర్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ ఫామ్‌తో మహిళల ఆర్థికాభివృద్ధి

● డీఆర్డీఓ శ్రీను



డెయిరీ ఫామ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీఓ శ్రీను

దామెర : మండల కేంద్రంలో డైయిరీ ఫామ్ ఏర్పాటుకు మంగళవారం డీఆర్డీఓ మెన శ్రీను స్థలాన్ని పరిశీలించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి డైయిరీ ఫామ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. కాగా ఇందు కోసం దామెర పెద్ద గుట్ట సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని డీఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డైయిరీ ఫామ్ ఏర్పాటు కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో 10 ఎకరాల భూమిని పరిశీలించామన్నారు. గుర్తించిన స్థలం డైయిరీ ఏర్పాటుకు అనువైందిగా ఉందన్నారు. తగు చర్యల నిమిత్తం భూమికి సంబంధించిన వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ జ్యోతివలక్ష్మీదేవి, ఏపీఎం ఝాన్సీ, ఏపీఓ శారద, ఆర్ఐ సంపత్ ఉన్నారు.

అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

● డీబీఏఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేశ్



ఆర్డీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరకాల : మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డీబీఏఎఫ్ జిల్లా అధ్యక్షుడు మదాసి సురేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పరకాల మున్సిపాలిటీ ఆర్డీ మసూద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మదాసి సురేశ్ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల నాయకుల అండదండలతో పరకాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ గంజి వెంకట్ రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కలకోటి మహేందర్, ప్రజా సంఘాల నాయకులు మోరె ఐలయ్య, మంద వెంకటయ్య, పోలెపాక రమేశ్ పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు సహకరించాలి

● మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్

పరకాల : వివిధ గ్రామాల నుంచి పనులు నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు అవసరమని, వాటి ఏర్పాటుకు సామాజిక వేత్తలు, దాతలు ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ సి.హెచ్ వెంకటేశ్ పిలుపునిచ్చారు. పాత మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట, అంబేడ్కర్ కూడలిలో పరకాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నీటిని ఎక్కువగా తాగాలని, అవసరం ఉంటేనే బయటికి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర



ఆత్మకూరు : నివాళులర్పిస్తున్న నాయకులు



ఎల్కతుర్తి : కొత్తపల్లిలో నాయకుల పాదయాత్ర

ఆత్మకూరు : భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర పన్నుతుందని జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ మండల కో ఆర్డినేటర్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణరావు ఆరోపించారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గూడెప్పాడ్‌లో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలనే లక్ష్యంతో ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు దేశ సమాజం క్షమించరానిదని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రను బీజేపీ మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బీరం సునంద, మండల వర్కింగ్ అధ్యక్షుడు వాసు, గూడెప్పాడ్ గ్రామ అధ్యక్షుడు రఘుపతి, మాజీ ఎంపీపీ సుమలత పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : భారత రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పాదయాత్ర మంగళవారం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లిలో, ఎల్కతుర్తి మండలం సూరారంలో కొనసాగింది. కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రపన్నుతుందన్నారు. నాయకులు సంతాజీ, ప్రకాశ్, చంద్రశేఖర్‌గుప్తా, రాజు, రమేశ్, అశోక్‌రెడ్డి, మహేందర్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో పరకాల విద్యార్థిని ప్రతిభ



పరకాల : మెడల్ అందుకుంటున్న పావనిసుధ



పుల్లా కుమారస్వామి



కొట్టే అర్పిత

పరకాల : పట్టణానికి చెందిన విద్యార్థిని ఆరెపల్లి పావనిసుధ ఎంబీబీఎస్ కోర్సులో 6 మెడల్స్ సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. నిజమాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఇటీవల ఎంబీబీఎస్ పూర్తిచేసిన పావనిసుధ.. ఐదు సబ్జెక్టుల్లో డిస్టింక్షన్ సాధించారు. ఈ మేరకు మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శివప్రసాద్, గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా మెడల్ అందించారు. ఎంఎస్ జనరల్ సర్జన్ పూర్తి చేసి జీవితంలో పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని పావనిసుధ తెలిపారు.

అర్పితకు డాక్టరేట్

ధర్మసాగర్ : మండల కేంద్రానికి చెందిన కొట్టే అర్పిత కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ పొందారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో సాఫ్ట్వేర్‌గా పనిచేస్తున్నారు. డెవలపింగ్ రోబస్ట్ డీప్ లెర్నింగ్ మోడల్స్ ఫర్ ప్రిసైస్ బ్రెయిన్ ట్యూమర్ డిటెక్షన్ అండ్ క్లాసిఫికేషన్ యూసింగ్ ఎంఆర్ఐ డేటా అనే అంశంపై పరిశోధన చేయగా ఆమెకు హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.

కమలాపూర్ వాసికి డాక్టరేట్

కమలాపూర్ : మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పుల్లా కుమారస్వామి తెలుగు విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. కాకతీయ యూనివర్సిటీలో ఆచార్య పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కుమారస్వామి 'తెలంగాణ దళిత నవలలు–అధ్యయనం' అనే పరిశోధన గ్రంథం సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కుమారస్వామిని ఆల్ ఇండియా యూనివర్సిటీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, నాయకులు నవీన్, వర్షిత్, శ్రీకాంత్ శాలువాతో సత్కరించారు.